క్లుప్తంగా

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం : మండలంలోని పాచికలపాడులో సాగు చేసిన మినుము, శనగ పంటలను శుక్రవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, అంకయ్యకుమార్, మాధురి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున శనగ పంటలో వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా 2 మి.లీ. హెక్సాకోనోజల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే 19:19:19 10 గ్రాముల ఎరువును లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, వీఏఏ జబ్బీరుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న వార్డన్ శ్రీవాణి

కమలాపురం : ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని తద్వారా విజ్ఞానం సంపాదించుకోవాలని స్థానిక ఎయిమ్ ఫర్ సేవా (ఛాత్రాలయ) వార్డన్ శ్రీవాణి, రిటైర్డ్ డీఎం హెచ్ఓ కార్యాలయ సిబ్బంది నరసింహులు తెలిపారు. కమలాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి ఎస్.నాగాంజలి ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

వేముల : పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీటీసీ బైయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పంచాయతీలకు విడుదల అవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు తదితర పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, డీఈ సాల్మన్, ఏఈ రమేష్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీటీలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణ దాతకు సన్మానం



వెంకటేశ్వరరెడ్డి సన్మానిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి (ఫైల్)

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామ సమీపంలోని గురుకుంట్ల వద్ద ప్రారంభించిన కల్యాణ మండపానికి రూ.40 లక్షలు విరాళం ఇచ్చిన దొరనాసి వెంకటేశ్వరరెడ్డి, ఆయన కూతురు అనిషాలను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపారాధన చేశారు.

కొంత స్థలం గొర్రెల కాపరులకు కేటాయిస్తాం

మైలవరం : కొంత స్థలం గొర్రెల కాపరులకు కేటాయిస్తామని స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మీనారాయణ గొర్రెల కాపరులకు హామీ ఇచ్చారు. స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మీనారాయణ, తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణలు శుక్రవారం సోలార్ అధికారులతో కలిసి వద్దిరాల వద్ద ఉన్న వివాదస్పద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు గొర్రెల కాపరులతో సమావేశం నిర్వహించి నచ్చజెప్పె ప్రయత్నం చేశారు.

2016వ సంవత్సరంలోనే అప్పటి ప్రభుత్వం ఈ కొండను సోలార్ అధికారులకు అప్పగించిందని ఇప్పుడు మీరు మారం చేస్తే ఏలా అంటూ నచ్చజెప్పారు. అయితే గొర్రెల కాపరులు వంద సంవత్సరాలు నుంచి మా వృత్తి గొర్రెలను మేపుకుని కుటుంబాలను పోషించుకుంటున్నాం. చివరకు మా గొర్రెల దొడ్లు కూడా కూలద్రొసి మమ్మల్ని కొండనుంచి తరిమికొడితే ఏలా అంటూ గొర్రెల కాపరులు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ సోలార్ అధికారులతో కలసి తాను రికార్డ్‌లను పరిశీలించి కొంత స్థలం గొర్రెల కాపరులకు కేటాయిస్తామని, అంత వరకు గొర్రెల దొడ్లు ఉన్న స్థలంలో ఏలాంటి నిర్మాణం చేపట్టరాదని సోలార్ అధికారులకు ఆయన సూచించారు.

హరహర మహాదేవ శంభోశంకర

- కార్తిక పౌర్ణమితో కళ కళ లాడిన శైవ క్షేత్రాలు
- ఘనంగా జ్వాలా తోరణం



పుష్పగిరి కొండపైన ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కార్తిక పౌర్ణమి కావడంతో శివాలయాల్లో పూజలు నిర్వహించారు. బిల్వార్చన, రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంచామృతాభిషేకాలు చేసి ఆ దేవదేవున్ని వేడుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ పరిధిలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారు జామునుండే క్యూకట్టారు. అలాగే ఉమామహేశ్వరస్వామి(బసవన్నకట్ట) ఆలయంలో శివున్ని ప్రత్యేకంగా అలంకరించారు. కడపరోడ్డులోని శివాలయం, కోతిసమాధి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని నామాలగుండు, పంచలింగాలకోన, గుండాలకోన, మోట్నూతలపల్లిల్లో వెలసిన కోనగవేశ్వరాలయం భక్తులతో కనువిందుచేశాయి. భక్తులు నోములు చేశారు. ఇంటి ముంగిట కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయాల్లో జ్వాలా తోరణం వెలిగించారు. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న శ్రీచక్రసహిత మహాలక్ష్మి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు. అమ్మవారిశాల, వీరభద్రస్వామి, షిర్డిసాయిబాబా తదితర ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

భక్తులతో కిటకిటలాడిన పుష్పగిరి

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని నలు మూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ సంతానమల్లేశ్వరస్వామి, శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వాములకు అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి ఆలయంలో వైద్యనాథ స్వామికి అభిషేకాలను నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ మాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కొండపైన మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు అఖిల్ దీక్షితులు పాల్గొన్నారు.

పొలతలలో వైభవంగా వేడుకలు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కోనేటిలో స్నానాలు అచరించి ఆలయ అవరణంలో కార్తీక దీపాలు వెలిగించి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం రాత్రికి ఆలయ అవరణంలో జ్వాలా తోరణ, గంగా హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈఓ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని కోనమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపార్చన నిర్వహించారు. వెలిదండ్ల, బోనాల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వన బోజనాల కార్యక్రమాలను ప్రజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వేములలో..

వేముల : కార్తిక పౌర్ణమిని పురష్కరించుకుని మహిళలు బైరవేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించారు. అలాగే స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మంజూనాథ స్వామి ఆలయంలో కోలాటం, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణ, మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కన్యతీర్థంలో పూజలను నిర్వహించి ఆలయం ముందు దీపాలను వెలిగించారు. గ్రంథేసోమేశ్వర ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణ పరిధి కన్నెలూరు గ్రామంలోని శివాలయంలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం మంగళ గౌరీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గౌరీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

చెన్నూరులో..

వల్లూరు(చెన్నూరు) : మండలంలోని శివాల్‌పల్లె వద్ద వెలసిన శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయమంతా శివనామ స్మరణతో మార్మోగింది.

చక్రాయపేటలో...

చక్రాయపేట : స్థానిక వేంకటేశ్వర, రాచరాయ స్వామి (వీరభద్ర స్వామి), సురభి గ్రామం, బండ్లయ్యగారిపల్లె వైతరణి నది ఒడ్డున వెలిన సిద్దేశ్వర స్వామి ఆలయం, సురభి అగ్రహారం శివాలయం, మహదేవపల్లెలోని శివాలయం, గండి ఉమామహేశ్వ రాలయాలలో, నాగలగుట్టపల్లె వద్ద నున్న దశరథ మహారాజు ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామం సమీపంలో మొగమూరు, పాపాఘ్ని, పావని నదుల సంఘమంలో వెలసిన సంఘమేశ్వరుని ఆలయం, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన, సాయిబాబా ఆలయం, సంగాలపల్లెలోని శ్రీ శివక్రిష్ణ గోశాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు దీపాలను వెలిగించారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్య శర్మ తమ శిష్య బృందంతో ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం జరిగింది.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, ఆర్య వైశ్య మహిళా మండలి అధ్వర్యంలో శ్రీ వాసవి కాన్యక పరమేశ్వరి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా గౌరమ్మతల్లిని ప్రతిష్ఠించినట్లు ఆలయ మండలి నిర్వాహకులు తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు అమ్మవారికి అభిషేకాలు జరుగుతాయన్నారు. 20వ తేదీ గౌరమ్మతల్లి నిమజ్జనం కార్యక్రమం జరుగుతుందన్నారు.



పులివెందుల : ప్రత్యేక అలంకారంలో శ్రీమిట్టమల్లేశ్వరుడు



పులివెందుల : ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పొలతలలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు



కన్నెలూరూ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జమ్మలమడుగు : కన్యతీర్థంలో కొలువైన శివుడు



చక్రాయపేటలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : స్థానిక ఇసీ గంగిరెడ్డి (దినేష్ మెడికల్ సెంటర్) ఆసుపత్రికి ఆదివారం నరాల, గుండె జబ్బుల శస్త్ర చికిత్స నిపుణులు వస్తున్నట్లు ఆసుపత్రి వారు తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు వంటి ఒళ్ళు నొప్పులకు అయన చికిత్స అందించనున్నట్లు తెలిపారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి ఉదయం 11:00 నుండి మధ్యాహనం వరకు అందుబాటులో ఉంటారన్నారు. పై వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనమే

పులివెందుల టౌన్ : యువత మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మత్తు పదార్థాల నుంచి వచ్చే సమస్యల గురించి, అనారోగ్యం గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. నగరాల్లో ఎంతో మంది విద్యార్థులు వీటికి అలవాటుపడి వారి జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తం ఉండాలన్నారు. పులివెందుల పట్టణ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అనేది చాలా ముఖ్యం దీనిని జయించగలిగేది కేవలం విద్య తోనేనన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అంటోనీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ అమల్ ఆరోక్యరాజు, వైస్ ప్రిన్సిపాల్ వనచిన్నప్ప, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కళ్యాణి రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్‌కు మెమెంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్

పథకాల ముసుగులో టీడీపీ సభ్యత్వ నమోదు

పులివెందుల టౌన్ : పట్టణంలో టీడీపీ నాయకులు పథకాల ముసుగులో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు తెలిపారు. వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు కార్యక్రమమని చెప్పకుండా పథకాల పేరుతో సభ్యత్వ నమోదు డబ్బులు తీసుకుని చేస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదు చేయకుంటే పథకాలు రావని ప్రజలకు చెప్పడంతో వారు భయపడి సభ్యత నమోదు చేయించుకుంటున్నారన్నారు. సభ్యత్వ నమోదు చేస్తే ప్రమాద బీమా రూ.5 లక్షలు వస్తుందని చెప్తున్నారు తప్ప పార్టీ సభ్యత్వ నమోదని చెప్పడం లేదన్నారు. ఇస్లాంపురం, జెండా మాను వీధి, అహోబిలాపురం, తదితర ప్రాంతాలలో టీడీపీ నాయకులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం తీర్మానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

పులివెందుల టౌన్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు మేరకు ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆర్డినెన్స్‌కు తీర్మానం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. గురువారం పులివెందులలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లోని దశాబ్ద కాలంగా రాజ్యాంగపరమైన ఎస్సీ రిజర్వేషన్లు మాదిగ ఉపకులాలకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రాల విభజన ముందుకు రావడంతో చట్టబద్ధతకు నోచుకోక పోగా మాదిగ ఉప కులాలలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిందన్నారు. అప్పటినుంచి మాదిగ ఉప కులాలు అనేక ఉద్యమాలు చేయగా వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని 01/08/2024న అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ తుది తీర్పు నిచ్చిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ అమలకు క్యాబినెట్ తీర్మానం చేసి ఆర్డినెన్స్‌ను జారీ చేసేవరకు ఉద్యోగ నియామకాలను నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డప్పు, చర్మ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కృష్ణమూర్తి, పులివెందుల నియోజకవర్గ కన్వీనర్ మిద్దె రామకృష్ణ, మండల నాయకులు, మండల కన్వీనర్ చిన్నగంగరాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో అకడమిక్ ఫస్టియర్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. శుక్రవారం కళాశాల చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి పల్లాకృష్ణ నోటిఫికేషన్ విడుదల చేశారు.

మరమ్మతులు చేపట్టండి



కంపచెట్ల మధ్య శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయం

కమలాపురం : మండలంలోని సి.గోపులాపురం గ్రామంలో శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు రాయుడు, ఓబయ్య, బాలిరెడ్డి తదితరులు కోరుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఇందులోనే కొనసాగేది. ప్రసుత్తం ఈ కార్యాలయంలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు మొలిచి శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ సరుకులు సైతం ఇక్కడి నుంచే పంపిణీ జరుగుతుందన్నారు. ఈ రేషన్ సరుకుల కోసం ప్రజలు బిక్కు బిక్కు మంటూ కంపచెట్ల మధ్య నుంచి రావాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యాలయానికి కనీసం డోర్ కూడా లేదని, అధికారులు స్పందించి ఈ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టి వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న న్యాక్ అకాడమిలో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్కిల్ కాలేజ్ ద్వారా సర్వేయర్, ఫీల్డ్ ఇంజనీర్, సోలార్, పీవీ ఇంజనీర్, సర్వేయర్, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్, డిప్లమా, ఐటీఐ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసక్తి గలవారు నవంబర్ 25వ తేదీ లోపు హాజరుకావాలన్నారు. 120 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు బోజనం, వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9985142155, 9000517637 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ



కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఎర్రగుంట్ల : మండలంలోని ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్‌స్టేషన్లను జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం అకస్మీకంగా తనిఖీ నిర్వహించి రెండు స్టేషన్‌లలో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కరాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అర్బన్ సీఐ నరేష్‌బాబు, ఎస్ఐలు నాగమురళి, తిమోతిలు పాల్గొన్నారు.

ముద్దనూరు : మండలంలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెడతామని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి నిత్యం పర్యవేక్షణ వుంటుందని, ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధవహిస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగమ్మతల్లి, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో శనివారం నుండి 3 రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని ఏపీఎస్ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంకల్పము, గణపతి పూజ జరుగుతుంది. అనంతరం స్వస్తి పుణ్యాహవాచనము, యాగశాల ప్రవేశం, వాస్తు హోమం, అఖండ దీప స్థాపన జరుగుతాయి. సాయంత్రం అంకురార్పణము, జలాధి వాసము, అగ్ని ప్రతిష్ఠ, దీక్షా హోమము జరుగుతాయి. ఆదివారం ఉయదం ప్రధాన కళశ స్థాపన, నవగ్రహ ఆరాధన, వివిధ హోమాలు జరుగుతాయి. యంత్రాభిషేకం అనంతరం గ్రామోత్సవం జరుగుతుంది. సాయంత్రం మహాస్నపనము, శయ్యాధి వాసము కార్యక్రమాలు జరుగుతాయి.

సోమవారం సూర్యోదయాత్పూర్వం 3 గంటల నుండి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ, శిఖర కళశ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం శాంతి హోమం జరుగుతుంది. ఉదయం 9 గంటలకు మహా పూర్ణాహుతి అనంతరం కుంభాభిషేకము, ప్రాణ ప్రతిష్ఠ, కళాన్యాసములు, నేత్రోన్మలనము కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అయ్యప్ప ఆలయ మంటపం ప్రారంభం

కమలాపురం : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన మంటపాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ కోరిక మేరకు ఈ మంటపం నిర్మాణానికి రవీంద్రనాథ్‌రెడ్డి గతంలో రూ.6 లక్షల నగదు వితరణ చేశారు. దీంతో ఆయన చేతుల మీదుగా ప్రారంభించామని అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ నివాసానికి చేరుకుని పలు రాజకీయ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, ఇస్మాయిల్, గఫార్, జావీద్, దేవదానం తదితరులు పాల్గొన్నారు.



మంటపాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

ఘనంగా ప్రథమ దశాబ్ది వార్షికోత్సవం

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రథమ దశాబ్దివార్షికోత్సవం, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించామని కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభా పాఠవాలు కనబరిచారు. కార్యక్రమంలో ఏపీసీసీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి, కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ మూర్తి, నెల్లూరు ఆర్ ఎస్ఆర్ కాలేజి ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి, జబర్దస్త్ టీం కళాకారులు హాజరయ్యారు.



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

వర్షంతో ఉల్లికి నష్టం

ముద్దనూరు : రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షంతో తడిసిన ఉల్లిపంటకు నష్టంవాటిల్లితోంది. ఇప్పటికే ఉల్లిపాయలు కోసి అమ్మకానికి సిద్ధంగా వున్న రైతులు నష్టాలు ఎదుర్కోవలసి వస్తోంది. ఉల్లిని ఆరబెట్టు కోవడానికి కూడా వాతావరణం అనుకూలించక పోవడంతో చేతికొచ్చిన గడ్డలు దెబ్బతిన్నట్లు ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఈ వర్షంతో ఒకటి రెండు పంటలకు లాభం చేకూరుతున్న మరి కొన్ని పంటలకు ఇబ్బంది ఎదురవుతోందిని రైతులు తెలిపారు.



తడిసిన ఉల్లిని ఆరబెట్టుతున్న రైతులు

ఎర్రిపల్లెలో బోద వ్యాధిపై సర్వే

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎర్రిపల్లె గ్రామంలో శుక్రవారం బోధ వ్యాధిపై సర్వే నిర్వహించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గ్రామంలో రక్తపూతల సేకరణ చేశామన్నారు. ప్రతి ఏడాది నవంబర్ నెలలో రెండు గ్రామాలను ఎంపిక చేసి బోధ వ్యాధికి సంబంధించి రక్తపూతల సేకరణ చేస్తామన్నారు. ముఖ్య ంగా కాలువల్లో చెత్త పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్, హెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.